మతోన్మాద బిజెపిని సాగనంపుదాం

- సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి-వెల్దుర్తి

ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం భారతదేశాన్ని కాపాడుకుందాం అంటూ వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు నగేష్, సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోడీ కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ సొమ్మును దోచిపెట్టి కార్పొరేట్ల సేవకునిగా పనిచేసి భారీగా అలసిపోయాడని పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలను మరిచిపోయా డని తెలిపారు. నిత్యావసర వస్తువు ల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ రకరకాల పన్నులు పెంచి ప్రజల పైన పెనుభారాలు మోపాడని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్షాలపై నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేసి రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. భారత ప్రజలమైన మనందరం కార్పొరేట్ సేవకుడైన నరేంద్ర మోడీకి, ఆయన పార్టీ బిజెకి రెస్ట్ ఇచ్చి ఇంటికి పంపాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు రాజు, సిపిఐ నాయకులు చిన్నమాదులు, ఎల్లప్ప, చిలిపి కృష్ణ పాల్గొన్నారు.

ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు

వెయ్యి దాటిన యువగళం

- జనసంద్రమైన ఆదోని - ఆదోనిలో మిర్చి యార్డు - టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి /ఆదోని/ఆదోని రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని దాటింది. పాదయాత్ర ఆదోని పట్టణంలో సాగింది. ఆదోని శివారు క్యాంపు శిబిరం నుంచి ప్రారంభమైన పాదయాత్ర బైపాస్ క్రాస్, ఆర్ట్స్ కళాశాల, దర్గా, ఎమ్మిగనూరు సర్కిల్, రైల్వే స్టేషన్ రోడ్డు, మేదరగేరి బ్రిడ్జి, రాయల్ మిల్ మీదుగా కడితోట క్రాస్ వరకు సాగింది. ఆదోని పట్టణం జనసంద్రమైంది. లోకేష్‌ను చూసేందుకు రోడ్డుకిరువైపులా జనం బారులు తీరారు. ఆదోని బైపాస్ బాధితులు లోకేష్‌ను కలిశారు. జాతీయ రహదారి 167లో భాగంగా ప్రతిపాదించిన ఎలాయిన్మెంట్ 2 పట్టణ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమైందని, దీని వల్ల 400 కుటుంబాలపై ప్రభావం పడుతుందని తెలిపారు. ఎలాయిన్మెంట్ 3ను పరిగణనలోకి తీసుకుని రోడ్డు నిర్మించాలని కోరారు. మాలమహానాడు ప్రతినిధులు లోకేష్‌ను కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, పత్తి పరిశోధన కేంద్రాన్ని, రాయలసీమలో మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్ ప్రతినిధులు లోకేష్‌కు విన్నవించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించి రాయితీ రుణాలు అందించాలని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ వర్గీకరణకు చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ ప్రతినిధులు లోకేష్‌కు విన్నవించారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌ను కలిశారు. ఫ్లెక్సీ ప్రింటింగ్‌ను నిషేధిస్తూ తెచ్చిన 65, 75 జిఒలను రద్దు చేయాలని, ప్రభుత్వ రాయితీలు అందించాలని కోరారు. మోటార్ సైకిల్ మెకానిక్స్ అసోయేషన్ ప్రతినిధులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. సిరుగుప్ప క్రాస్ వద్ద వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని లోకేష్ ఆవిష్కరించారు. అనంతరం కడితోట వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ... ఆదోనిలో మిర్చి యార్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్‌ఎల్‌సి ఆధునీకరణ చేపట్టి 24 టిఎంసిల నీటిని అందించే బాధ్యత తీసుకుంటామన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తామని, ఈఎస్ఐ ఆస్పత్రికి కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆదోని ఎమ్మెల్యే, కొడుకు, భార్య శాఖలు పంచుకుని వాటాలు తీసుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే పేరు సాయి ప్రసాద్ రెడ్డి కాదని, ఆయన పేరు క్యాష్ ప్రసాద్ అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే కొడుకు ఎర్రమట్టి దోచేస్తున్నారని, కొండలు మింగేస్తున్నారని అన్నారు. ఆదోనికి పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని, పత్తి మార్కెట్‌లో వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రులు భూమా అఖిలప్రియ, అమర్‌నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటి.నాయుడు, టిడిపి ఆదోని నియోజకవర్గం ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు. శుక్రవారం 14.1 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. ఇప్పటి వరకు 1004 కిలోమీటర్లు లోకేష్ నడిచారు.

1000 కిలో మీటర్ల మైలురాయిని ఆవిష్కరిస్తున్న లోకేష్, నాయకులు

అభివృద్ధి అంటే స్టిక్కర్లు, రంగులు వేసుకోవడమా..?

ఆదోనిలోని వెంకన్నపేట వార్డు సచివాలయం ముందు లోకేష్ సెల్ఫీ దిగారు. గతంలో ఇక్కడ వేలాది పేదల ఆకలితీర్చే అన్న క్యాంటీన్ ఉండేదని, అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఎక్కడా ఒక్క ఇటుక పెట్టడం చేతకాలేదు కానీ, అన్న క్యాంటీన్ భవనాన్ని సచివాలయంగా మార్చేసి వైసిపి రంగులు వేసుకున్నారని లోకేష్ పేర్కొన్నారు. ఇంకా ఎంతకాలం ఈ స్టిక్కర్ల బతుకు జగన్మోహన్ రెడ్డి? అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

యువగళంలో ఉద్రిక్తత

యువగళంలో కాస్త ఉద్రిక్తత చోటు చేసుకుంది. లోకేష్ శ్రీనివాస భవన్ వద్ద నడుస్తున్న సమయంలో కొందరు వైసిపి కార్యకర్తలు 'లోకేష్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఆగ్రహించిన టిడిపి నాయకులు వారిని తరిమి పంపించారు.

లోకేష్‌తో కలిసి నడుస్తున్న నాయకులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రంజాన్ పండుగను పురస్కరించుకుని కర్నూలు నగరంలో శనివారం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కర్నూలు ఆర్‌టిసి బస్టాండు దగ్గర గల సుందరయ్య సర్కిల్ నుంచి వెళ్లే వాహనాలు వెంకటరమణ కాలనీ మీద మళ్లిస్తారు. బంగారుపేట రహదారి బంద్ చేసి వచ్చే వాహనాలు ఆర్ఎస్ రోడ్డు వైపు మళ్లిస్తారు. గౌరీగోపాల్ హాస్పిటల్ ఎదురుగా కిసాన్ ఘాట్ రూటు నుండి ఆనంద్ థియేటర్ వైపు వెళ్ళే రూట్ ను మూసివేయనున్నారు. కర్నూలు ఆర్టీసి బస్టాండు నుంచి నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను బళ్లారి చౌరస్తా మీదుగా కృష్ణానగర్, గుత్తి పెట్రోల్ బంకు, బిర్లా జంక్షన్, మద్దూరు నగర్ మాస్క్, అమ్మ హాస్పిటల్, నంద్యాల చెక్ పోస్టు మీదుగా పోనిస్తారు. కర్నూలు ఆర్టీసి కొత్తబస్టాండు నుంచి డోన్ వైపు వెళ్లే వాహనాలన్నీ బళ్లారి చౌరస్తా, సస్యాహోండా షోరూమ్ నుండి ఫ్లై ఓవర్ మీదుగా దారి వెళ్లాల్సి ఉంటుంది. అలంపూర్, గద్వాల, ఐజ, హైదరాబాదు వైపు వెళ్లే బస్సులు బళ్లారి చౌరస్తా సంతోష్ నగర్ హైవే మీదుగా వెళ్లాల్సి ఉంటుందని కర్నూలు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

డిఎస్‌పి కార్యాలయాన్ని డిఐజి వార్షిక తనిఖీ

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు పట్టణ డిఎస్‌పి కార్యాలయాన్ని కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్‌తో కలిసి శుక్రవారం వార్షిక తనిఖీ చేశారు. అన్ని రికార్డులను పరిశీలించారు. ముందుగా పోలీసు గార్డు సిబ్బంది కర్నూలు రేంజ్ డిఐజికి గౌరవవందనం చేశారు. కర్నూలు సబ్ డివిజన్ లోని కేసుల పురోగతిపై వివరాలను ఆరా తీసి , క్రైమ్ రివ్యూ చేశారు. శాంతిభద్రతల గురించి కర్నూలు డిఎస్‌పి మహేష్‌తో చర్చించి కేసులను సమీక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలన్నారు. దిశ యాప్, సైబర్ క్రైం, సిసి కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన చేయాలన్నారు. అనంతరం కర్నూలు రూరల్ సర్కిల్ పోలీసుస్టేషన్‌ను కూడా డిఐజి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పట్టణ డిఎస్‌పి కెవి.మహేష్, సిఐలు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, రామలింగయ్య, శంకరయ్య, తబ్రేజ్, శ్రీధర్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

డిఎస్‌పి కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డిఐజి

విత్తనాల విక్రయాలపై తనిఖీలు

చిరు ధాన్యాల సాగు పెంపునకు చర్యలు

- కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోకుండా విక్రయాలు చేస్తున్న షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ళ సృజన వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డిమౌర్య పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయాలపై చర్చ సందర్భంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలలో రైతులు జిప్సం తదితర సూక్ష్మ పోషకాలు, నీమ్ ఆయిల్ కోరుతున్న సందర్భంగా ఎంత మంది రైతులకు అవసరం ఉందో తెలుసుకుని వాటిని తెప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ రాజును ఆదేశించారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా జొన్న, సజ్జ, కొర్ర, రాగులను రైతులు ఎక్కువ పండించే విధంగా మోటివేట్ చేయాలని జిల్లా కలెక్టర నిఆదేశించారు. చిరుధాన్యాలను ప్రోత్సహించడంలో భాగంగా కలెక్టరేట్‌లో మిల్లెట్ కేఫ్ ఏర్పాటుకు కలెక్టర్ అంగీకరించారు. రైతుల ఆత్మహత్యలకు సంబంధించి ఏ అధికారి వద్ద కూడా ఫైల్ పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలకు, పొలం బడులలో ప్రజా ప్రతినిధులు, రైతులను భాగస్వాములను చేయాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు మొక్కుబడిగా జరుగకూడదని, ఆర్థికేతర సమస్యలకు ఈ సమావేశాల్లో పరిష్కారం చూపే విధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఫిషరీస్ డిపార్టుమెంట్‌కు సంబంధించి ఎన్ని ఔట్‌లెట్స్ సిద్ధం చేశారని ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు.. 129 మినీ ఫిషరీస్ ఔట్‌లెట్స్‌కు గాను 30 రన్నింగ్‌లో ఉన్నాయని, మిగిలిన వాటికి లబ్ధిదారులను గుర్తిస్తున్నామని ఆమె తెలిపారు. పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నకిలీ విత్తనాల ద్వారా నష్టపోయిన రైతులకు న్యాయంచేయాలని, ఇలాంటి కంపెనీలు విత్తనాలు అమ్మకుండా ఎందుకు బ్యాన్ చేయకూడదని ప్రశ్నించారు. ఈ అంశం కమిషనరేట్ పరిధిలో ఉందని డిఎఒ వివరించారు. గ్రామాల్లో రైతులు అందరూ ఈ క్రాప్ నమోదు చేసే విధంగా సచివాలయ పరిధిలో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు అవగాహన కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ... పొలంబడికి సంబంధించి టెక్నికల్ ట్రైనింగ్ క్లాసెస్ నిర్వహిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఫర్టిలైజర్స్ వాడకం తగ్గించి నాచురల్ ఫార్మింగ్ చేసే విధంగా వారిని మోటివేట్ చేయాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

పౌరులకు సకాలంలో సేవలందించాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

పౌరులకు సకాలంలో సేవలందించడమే లక్ష్యంగా సివిల్ సర్వెంట్లందరూ పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. 16వ సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజతో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులు పౌరులకు సకాలంలో మెరుగైన సేవలు అందించేందుకు పునరంకితం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా మనం ఎవరి కోసం పనిచేస్తున్నామో వారికి సకాలంలో సత్వర సేవలు అందించడం ద్వారా వారికి మేలు చేకూర్చాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

నారాయణలో గ్రాడ్యుయేషన్ సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మాధవి నగర్ లో ఉన్న నారాయణ పాఠశాలలో శుక్రవారం ఈ కిడ్స్ విభాగంలోని యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సంబరాలు ఘనంగా జరిగాయి. ముందుగా యుకెజి విద్యార్థులు పట్టభద్రుల వేషధారణలో అతిథిని వేదిక పైకి స్వాగతించి, గ్రాడ్యుయేషన్ వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రిన్సిపల్ అల్తాఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిన్న పిల్లల వైద్యురాలు డాక్టర్ ఎం.విజయ వాణి పాల్గొని విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ అరుణ, సాఫ్ట్ స్కిల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ ముంతాజ్ బేగం, రాధా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తుగ్గలి : ప్రజా సమస్యలు పరిస్కారమే గడప గడపకు మన ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. మండలం పరిధిలోని ఎద్దులదొడ్డి గ్రామంలో స్థానిక నాయకులు, వైస్ ఎంపిపి మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లుడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం వారి సమస్యలను విని అక్కడే పరిష్కరించే విధంగా ఏర్పాటు చేశారన్నారు. ఏ ప్రభుత్వం చేయని విదంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమం చేపట్టారన్నారు. అందుకే గ్రామాలలో ధైర్యంగా తిరుగుతున్నామన్నారు.

సమస్యలు తెలుసకుంటున్న ఎమ్మెల్యే శ్రీదేవి

మాకు జీతాలు ఇప్పించండి : పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- మద్దికెర : మద్దికేర మండలం యడవలి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై వారు విలేకరులతో మాట్లాడుతూ జీతాలు రాకపోతే తాము ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మాకు జీతాలు ఇప్పించి మా సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యుత్ శాఖలో తప్పు చేసిన వారికే అధికారుల అండదండలు

పనిచేసేది ఒకచోట , జీతం తీసుకునేది మరొక చోట ఇదెక్కడి న్యాయం ?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆదోని డివిజన్ ఎస్‌పిడిసిఎల్ పరిధిలో జరుగుతున్న తంతు ఇది. సంవత్సరం క్రితం ఎమ్మిగనూరు శివన్న నగర్ నందు 33/11 కెవిసబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా కె.నరసింహులు పనిచేస్తున్నారు. ఆయన డ్యూటీలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా అసాంఘిక కార్యక్రమాలు చేసేవారు. అక్కడ స్థానిక ప్రజలు ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆపరేటర్‌ను తక్షణం మార్చాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. అయినప్పటికీ ఆపరేటర్ పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోసారి అక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను స్థానిక ప్రజలు వీడియోలు తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో దానిపైన సమగ్రమైన విచారణ చేపట్టారు. దీంతో ఆపరేటర్‌ను తక్షణమే మరోచోటికి మార్చాలని 2022 మార్చి,22 నాడు ఉన్నతాధికారులకు సూచించారు. ఆదోని డివిజన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేటర్ ఎం.నరసింహులును గోనెగండ్ల మండలంలోని ఎర్రబాడు 33/11 కెవి. సబ్ స్టేషన్ కు 2022, ఏప్రిల్, 5 న ఎర్రబాడు 33/11కె.వి. సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ ఎం. రాఘవేంద్రప్రసాద్‌ను ఎమ్మిగనూరు శివన్న నగర్ 33/11కె.వి. సబ్ సేషన్ కు మార్చారమని కర్నూలు సూపరింటెంటింగ్ ఇంజనీర్‌కు 2022, మే,5 నాడు రిపోర్ట్ చేశారు. వీరిద్దరి జీతాలకు సంబంధించిన ఎస్ క్రో(escrow account) అకౌంటును మార్చాలని కర్నూలు ఎస్ఇకి 2022,మే, 5 నాడే ఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు పంపించారు. అయితే అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆపరేటర్ కె. నరసింహులు, అధికారుల అండతోనే, రాజకీయ పలుకుబడుతో తిరిగి ఎమ్మిగనూరు శివన్న నగర్ సబ్ స్టేషన్‌కు రావాలని ఒత్తిడి చేశారు. వారి ఎస్క్రో అకౌంట్‌ను ఆదోని డివిజన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మార్చలేదు. అందువలన తక్షణమే పని చేసే చోటనే ఎస్క్రో అకౌంట్ ఉండాలని ఆ విధంగా చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఎస్‌పిడిసిఎల్ (డిస్కం) కమిటీ ఉపాధ్యక్షులు పి.నాగరాజు, పి. ప్రవీణ్ కుమార్ ఎస్ఇ ఎం.ఉమాపతిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఆయన తక్షణమే మారుస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎస్ఇకి వినతిపత్రం ఇస్తున్న పి.నాగరాజు, పి .ప్రవీణ్‌కుమార్

నేడు ఈద్ ఉల్ ఫితర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ముస్లిం సోదరుల రంజాన్ ఉపవాసాలు ముగించుకుని 'ఈద్ ఉల్ ఫితర్' జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ముస్లింల పవిత్ర గ్రంథం 'ఖురాన్' అవతరించిన రంజాన్ మాసంను ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసాలు, దీక్షలు, ఆధ్యాతిక్మక చింతన, దానాలు, ధర్మాలు చేపడతారు. నెలవంకతో ప్రారంభమైన రంజాన్ మాసం.. మళ్లీ నెలవంక రాకతో ముగుస్తుంది. 'ఈద్ ఉల్ ఫితర్' పండుగతో రంజాన్ పండుగ ముగుస్తుంది. షవ్వాల్ నెలలో మొదటి రోజైన ఈద్ ఉల్ ఫితర్ రోజున ఉపవాసం చేయకూడదనేది ఆచారం. రంజాన్ సందర్భంగా మసీదులలో తరావీహ్ ప్రార్థనలు జరుగుతాయి. ఇవి సాధారణంగా జరిగే ప్రార్థన కంటే ఎక్కువ సమయం అంటే రాత్రిపూట కూడా సాగుతాయి. సూర్యోదయానికి ముందు సెహరీతో ప్రారంభమైన ఉపవాస దీక్ష ప్రతి రోజూ సూర్యాస్తమయం తర్వాత చేసే ఇఫ్తార్ అనే విందుతో ముగిస్తారు. ఇలా నెల రోజుల పాటు సాగుతుంది. చివరి రోజున నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలు పూర్తయిపోతాయి. తర్వాత ఈద్ ఉల్ ఫీతర్ అనే పండుగ చాలా వైభవంగా జరుపుకుంటారు. పండుగ రోజున సాధారణంగా ఈద్ ముబారక్, ఈద్ సద్ అని కానీ శుభాకాంక్షలు ఒకరికొకరు చెప్పుకుంటారు. వివిధ దేశాల్లో వారి వారి స్థానిక భాషల్లోనూ ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. సక్రమ మార్గంలో నడుచుకుంటూ దేవుని యందు భక్తి విశ్వాసాలు కలవారికి వారు చేను సనుల ఆధారంగా మంచి, పవిత్రమైన జీవితం ప్రసాదించబడుతుందని ముస్లింలు నమ్ముతారు. క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసం. కూలీలతో పని చేయించుకున్నప్పుడు వారి చెమట ఆరకముందే కష్టార్జితం చెల్లించాలని ఖురాన్ చెబుతుంది. ఉపవాసంతో మనిషిని బాధించడం ఇస్లాం ఉద్దేశం కాదు పేదవాడి ఆకలి బాధలు తెలుసుకోవడమే ముఖ్యోద్దేశం అంటారు. ప్రతి రంజాన్ మాసం ఓ అద్భుత ప్రయాణం అందులో ఈద్-ఉల్-ఫితర్ ఓ అద్భుత ఘట్టం అని నమ్ముతారు. ముస్లింలంతా ఈద్ ఉల్‌ఫితర్ రోజున సామూహిక ప్రార్థనలు చేస్తారు. అల్లా అందరికి శాంతి, శ్రేయస్సును ప్రసాదించాలని, జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టాన్నీ అధిగమించే శక్తిని అల్లా ప్రసాదించాలని ప్రార్థిస్తారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటారు.

అశోకాలో ఘనంగా కాలేజీడే వేడుకలు

సినీ తారల సందడి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

దూపాడులోని 'అశోకా' ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతీ యేడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ క్యూబ్ ఉమెన్స్ కార్నివాల్' శుక్రవారం సినీ తారాల సందడి, మూవీ సింగర్స్ 'లైవ్ ఆర్కెస్ట్రా' ల మధ్య జరిగిన 'అశోకా కాలేజ్ డే' సంబరాలతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లైవ్ కాన్సర్ట్' నందు మూవీ ప్లే-బ్యాక్ సింగర్స్ దీపు , సోనీ కోమండూరి పాల్గొని లేటెస్ట్ మూవీ హిట్ సాంగ్స్ లతో ఆడి పాడి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించారు. వీరితో పాటుగా ప్రముఖ సినీ దర్శకురాలు నందిని రెడ్డి, సినీ హీరో సంతోష్ శోభన్, హీరోయిన్ మాళవిక నాయర్లతో కలిసి తాను నూతనంగా దర్శకత్వం వహించిన అన్నీ మంచి శకునములే' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తాము రాయలసీమలోనే నెం.1 అయిన 'అశోకా' ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీకి వచ్చామని, ఇంత భారీ సంఖ్యలో విద్యార్థినిల మధ్య మూవీ సాంగ్ రిలీజ్ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మాయిల జోష్ చూసి తనకు కూడా తన కాలేజ్ డేస్ గుర్తొచ్చాయని, నేటితరం విద్యార్థినిలు తాము ఎంచుకున్న రంగాలలో అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ఆ దిశగా మీరందరు కషి చేయాలన్నారు. అనంతరం మూవీ హీరో, హీరోయిన్స్ విద్యార్థినిలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ సెల్ఫీలతో వారిని ఉత్తేజపరిచారు. డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి విద్యాసంస్థల ఫౌండర్ డాక్టర్ కెవి. సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'ప్రతీ విద్యార్థిని సరైన దిశా నిర్దేశం చేసుకొని దానిని సాధించే వరకు దృఢ సంకల్పంతో నిరంతరం కృషి చేయాలని, అలాంటి విద్యార్థినిల లక్ష్యసాధనకై నిరంతరం సహకరిస్తున్న 'అశోకా' కాలేజ్ టీచింగ్ స్టాఫ్. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ టీమ్ లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

సినీ దర్శకులు నందిని రెడ్డి, సినీ హీరో సంతోష్ శోభన్, హీరోయిన్ మాళవిక

బాబుకు రాజకీయ సమాధి తప్పదు

- జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

మాట్లాడుతున్న జడ్‌పిటిసి విరుపాక్షి

రాష్ట్రంలో 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు ప్రజలంతా 2024లో రాజకీయ సమాధి కట్టే సమయం ఆసన్నమైందని ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. శుక్రవారం చిప్పగిరి జడ్‌పిటిసి స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి జగన్మోహన్ రెడ్డి పాలన ఎలా ఉందో, చంద్రబాబు పాలన ఎలా ఉందో ప్రజలంతా ఒక సారి నెమరు వేసుకుంటారని తెలిపారు. పేదలకు ఎవరు సహాయం చేశారనేది ప్రజలందరికీ తెలుసన్నారు. వాస్తవాలతో చెప్పిన మాటలకు, విలువతో ముందుకెళ్లే మనిషి జగనన్న అని తెలిపారు. మోసకారి మాటలు, కుళ్లు, కుతంత్రాలు, ఒక మనిషిని ఎలా దెబ్బతీయాలో ఇవన్నీ తెలిసిన నాయకులు చంద్రబాబు అని విమర్శించారు. కొడుకును పట్టాలను ఎక్కించడానికి ఎంతదాకైనా, ఎవరినైనా వంచించడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. తన సొంత మీడియా సంస్థలను తనకు కావాల్సిన రీతిలో వాడుకొని ప్రభుత్వంపై అడుగు అడుగునా విషం చల్లుతున్నారన్నారు. ఈయనకు వంతపడడానికి ఒక పార్టీ పెట్టిన వ్యక్తి తాను ముఖ్యమంత్రి కావడం మానేసి తాను చెప్పినట్లుగానే తల ఊపించి మాట్లాడడం, ఓట్లను చీల్చకుండా చేసి జగనన్నను ఓడిస్తానని పదే పదే చెప్పే ఆ పెద్ద మనిషికి విలువలు ఎంతవరకు ఉన్నాయో ప్రజలందరికీ తెలుసన్నారు. మాజీ కో కన్వీనర్, వాల్మీకి మండల అధ్యక్షులు లోకనాథ్, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, శ్రీరాములు, పుల్లన్న పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ జడ్‌పిటిసి మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

నివాళులర్పిస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు

ఆస్పరి మాజీ జడ్‌పిటిసి బాలకృష్ణ (58) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఇంట్లో రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం ఆదోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. మృతుడు బాలకృష్ణకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. 2006లో ఆయన ఆస్పరి జడ్‌పిటిసిగా విజయం సాధించారు. మండలంలో అన్ని పార్టీల నాయకులతో సత్సంబంధాలు ఏర్పరచుకుని కలుపుగోలుతనంగా వ్యవహరించేవారు. గత సర్పంచి ఎన్నికల్లో కూడా వారి పంచాయతీ నుంచి తమ్ముడు రాఘవేంద్ర భార్య రాధమ్మను పోటీ చేయించి గెలిపించుకున్నారు. గ్రామంలో కూడా వర్గాలతో మంచి సంబంధాలు ఉండడంతో ప్రజలు కడసారి చూసేందుకు భారీగా తరలి వచ్చారు. బాలకృష్ణ మృతదేహానికి శుక్రవారం రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, జడ్‌పిటిసి దొరబాబు, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, టిడిపి సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మన్న, శ్రీనివాస్ గౌడ్, సొసైటీ సిఇఒ అశోక్, నాయకులు తిమ్మప్ప, మోహన్, రంగన్న తదితరులు నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలకలడోణ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నదేనని తెలిపారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ వెంకట్ రెడ్డి, సిఇఒ వెంకటేష్, సర్పంచి నాగమ్మ, ఎంపిటిసి ఆకుల లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలకు వివరిస్తున్న ప్రదీప్ రెడ్డి

లోకేష్ పాదయాత్రలో ఉద్రిక్తత...

- టిడిపి, వైసిపి మధ్య తోపులాట - తీవ్ర పదజాలంతో దూషణలు

- ఎట్టకేలకు సర్ది చెప్పిన పోలీసులు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత నెలకొంది. టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఇరు గ్రూపులు తీవ్ర పదజాలంతో దూషణలు చేసుకున్నాయి. పోలీసులు అతి కష్టం మీద ఇరు గ్రూపులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆదోని నియోజకవర్గంలో శుక్రవారం టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో రెండో రోజు యువగళ పాదయాత్ర సాగింది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మీదుగా పట్టణంలోకి భీమాస్ సర్కిల్‌లోకి లోకేష్ యువగళం పాదయాత్ర ప్రవేశించింది. యాత్ర రాగానే 'గో బ్యాక్' అంటూ వైసిపి కార్యకర్తలు నినాదాలు చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అంతకుముందు వైసిపి నాయకులు దేవా, సురేష్, కిశోర్, దుర్గప్ప, లక్ష్మీనారాయణ, తాయన్న, కౌన్సిలర్ అశోక్, వసీం ఆధ్వర్యంలో ఫ్ల కార్డులు ప్రదర్శిస్తూ మూడు రాజధానులకు మద్దతుగా నినాదాలు చేస్తూ రైల్వే స్టేషన్ రోడ్డులో కోట్ల విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అక్కడికి టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. టిడిపి కన్వీనర్ సజ్జత్ హుస్సేన్, తదితరులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా పోటాపోటీగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో తోపులాట చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఏమాత్రం ఆదమరిచినా పరిస్థితి చేయి దాటి తీవ్ర ఘర్షణకు అవకాశం ఉండేది. టిడిపి, వైసిపి గ్రూపులు తీవ్ర పదజాలంతో ఒకరినొకరు దూషించుకున్నారు. డీఎస్పీ వినోద్ కుమార్, సిఐలు శ్రీరామ్, శ్రీనివాస్ నాయక్, ఈశ్వరయ్య, ఎస్ఐలు విజయలక్ష్మి చెదరగొట్టారు. వైసిపి గ్రూపును రాజశ్రీ హోటల్ వద్ద ఉంచారు. ఈ సందర్భంలో లోకేష్ పాదయాత్ర కోట్ల కూడలి మీదుగా మున్సిపల్ రోడ్డులో సాగుతుండగా వైసిపి నాయకులు పెద్ద రెడ్డి శ్రీనివాస్ రెడ్డి 'లోకేష్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేయడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఈలలు, కేకలు వేయడంతో భయానక వాతావరణం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద రెడ్డి శ్రీనివాస్ రెడ్డిపై భౌతిక దాడికి దిగారు. శ్రీనివాస్ రెడ్డి తప్పించుకునే ప్రయత్నంలో ఓ దుకాణంలో దాక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి చెదరగొట్టి పరిస్థితిని చక్కదిద్దారు. వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్న సందర్భంగా అధికార పార్టీ నాయకులు ఇలా నిరసన చేపట్టడం ఏమిటని పలువురు నిందించారు. నినాదాలు చేసుకుంటూ నారా లోకేష్ పాదయాత్ర ముందుకు సాగింది.

ఇరు గ్రూపులకు నచ్చచెబుతున్న డీఎస్పీ వినోద్ కుమార్, పోలీసులు

లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న బత్తిని కుబేర్‌నాథ్

'యువగళం'కు బత్తిని కుబేర్‌నాథ్ సంఘీభావం

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు పారిశ్రామికవేత్త బత్తిని కుబేర్ నాథ్ సంఘీభావం తెలిపారు. ఆదోని పట్టణంలో శుక్రవారం రెండో రోజు జరిగిన యువగళం పాదయాత్రలో నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోకేష్‌లో రోజురోజుకు రాజకీయ పరిణితి కనిపిస్తోందని తెలిపారు. యువతను ఆకట్టుకుంటూ తనదైన శైలిలో మాట్లాడుతూ ఉత్సాహం నింపుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో లోకేష్ వెంటే యువత ఉంటుందని తెలిపారు. నాయకులు నాగేంద్ర, కోటి ఉన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

- సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

కేంద్రంలోని మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపాలని సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని చిన్నతుంబలం బస్టాండ్ ఆవరణంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఈడిగ తిక్కన్న గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం కార్యవర్గ సభ్యులు పరమేష్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రశ్నించకుండా ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు.

ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు

ఎస్ఐ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద ఎస్ఐగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్‌ను కర్నూలు విఆర్‌కు బదిలీ చేశారు. అంతకుముందు అనంతపురం జిల్లా గుంతకల్లు వన్ టౌన్ ఎస్ఐగా శ్రీనివాసులు పని చేసినట్లు తెలిసింది. తర్వాత కొన్ని రోజులు విఆర్‌లో ఉంచారు. ప్రస్తుతం విఆర్ నుంచి ఈయనను హొళగుందకు బదిలీ చేస్తూ జిల్లా పోలీసు అధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం.

మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా గుమ్మనూరు నారాయణ

- త్వరలో ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా గుమ్మనూరు నారాయణ నియమితులయ్యారు. శుక్రవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో వైసిపికి అభివృద్ధి కోసం కృషి చేశామని తెలిపారు. తన సేవలను గుర్తించిన మంత్రి జయరాం ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా తన పేరును సూచించి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. తనను ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మంత్రి జయరాంకు, వైసిపి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన మంత్రి జయరాంకు ఎల్లవేళలా తోడుగా ఉంటామని చెప్పారు. వైసిపి అభివృద్ధికి, వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. త్వరలో మంత్రి జయరాం ఆదేశాల మేరకు ఆలూరులో ప్రమాణ స్వీకారోత్సవం ఏర్పాటు చేస్తామన్నారు. నాయకులు శ్రీధర్, రాజన్న, సతీష్, బాలకృష్ణ, షేకన్న, నారీ, గోవిందు, సూరి పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు స్కూటర్‌లో చెలరేగిన మంటలు

- దగ్ధమైన ద్విచక్ర వాహనం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో తీవ్ర ఎండతో ఓ ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగాయి. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస టాకీస్ దగ్గర రాజు మెకానిక్ షాపు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని ఎంబి చర్చి ప్రాంతంలో నివాసం ఉంటున్న జోసెఫ్ తన హీరో హోండా గ్లామర్ స్కూటర్‌ను రాజు మెకానిక్ షాపు వద్ద రిపేర్ కోసం ఉంచారు. స్టాండ్ వేసి ఉంచిన స్కూటర్ నుంచి ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. వెంటనే అక్కడ ఉన్న వారు అప్రమత్తమై ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పరుగులు తీశారు. అనంతరం స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేశారు. ఇందులో స్కూటర్ పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఎండకు ద్విచక్ర వాహనాలను నిలుపరాదని చర్చించుకున్నారు.

దగ్ధమైన స్కూటర్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ఆదోనిసబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

స్పందనలో స్వీకరించిన అర్జీ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్పందన, రీ సర్వే, మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్, స్టోన్ ప్లాంటేషన్, మీ సేవ సర్వీసెస్ తదితర రెవెన్యూ అంశాలపై డివిజన్‌లోని తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, రీ సర్వే ఉప తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యలను గడువులోపు పరిష్కరించాలని, ఒక వేళ సమస్యను ఏ కారణం చేతనైనా పరిష్కరించడానికి వీల్లేకపోతే, ఆ కారణాన్ని అర్జీదారునికి స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. కారణం చెప్పకపోతే ప్రజలు మళ్లీ, మళ్లీ అదే సమస్యతో కార్యాలయాలకు వస్తారన్నారు. స్పందనలో ఎక్కువ శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయన్నారు. ఇప్పటి నుంచి సరైన సమయానికి పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్, అబ్జెక్షన్స్ త్వరగా పరిష్కరించాలని తెలిపారు. బిఎల్‌ఒలు 7 ఫార్మాట్‌తో ఉన్న బిఎల్ఒ రిజిస్టర్ తప్పకుండా మెయింటైన్ చేయాలన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సమావేశానికి హాజరయిన అధికారులు

మహారాజ శ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

OS.NO.416/ 2022

పి.వెంకటేశ్వర్లు. ...వాది

V/s

ఈడిగ జయన్నగౌడ్ తండ్రి ఈడిగ మల్లయ్య,
ఇంటి నెం.4-428, పి.కోటకొండ (గ్రామం),
దేవనకొండ (మండలం), కర్నూలు (జిల్లా).
...ప్రతివాది

దావా సమన్లు

పై నెంబరు దావాలోని వాది, ప్రతివాది అయిన మీపై దావా ప్రాంసరి బాకీ రాబట్టుకొనుటకు గాను దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావా వాయిదా 27-04-2023న వున్నది. పై తేదిన ఉదయం 10.30 గంటలకు మీరు గాని మీ తరపున వకీలు గారు గాని పై కోర్టు నందు హాజరుఅయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై తెలిపిన కోర్టు వారు సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయుచున్నాము.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 27-04-2023

లక్ష్మిశెట్టి క్రిష్ణ ప్రసాద్,
న్యాయవాది,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ నెంబర్ : 9985247737

మహారాజశ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్.నెం.767/2021

చాకలి సంజమ్మ.
...వాది

-ఎదురి -

1.చాకలి సురేష్ పోతి వారసులు చాకలి జ్యోతి వగైరా.
...ప్రతివాదులు

1 నుండి 3వ ప్రతి వాదులకు దావా సమన్లు

1.చాకలి జ్యోతి భర్త సురేష్ తండ్రి చాకలి ఎల్లప్ప
2.చాకలి నరేష్ తండ్రి సురేష్
3.చాకలి మహాలక్ష్మి తండ్రి సురేష్
మైనరు గార్డియన్ తల్లి ఒకటవ ప్రతివాది.
ఇంటి.నెంబరు.49/1A-02, వికాస్ బ్యాంక్ స్కూల్ దగ్గర, లక్ష్మీ నగర్ కర్నూలు.

పై నంబరు దావాలో వాది, దావా మొత్తం రూ.1,71,000/-లు ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు వగైరా ప్రతి వాదుల స్వాధీనంలో ఉండే లేట్ సి. సురేష్ ఆస్తి నుండి రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినాడు. ఇందులో 1 నుండి 3వ ప్రతివాదులకు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 02-05- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 02-05-2023

సి.ప్రభాకర్ రెడ్డి,
యం.వి.చక్రపాణి,
వాదిపరం న్యాయవాదులు,
కర్నూలు.

మాట్లాడుతున్న ఎంఇఒ ఈరన్న

క్రమశిక్షణతో కూడుకున్న విద్య అవసరం

- ఎంఇఒ ఈరన్న

ప్రజాశక్తి - హొళగుంద

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడుకున్న విద్య అవసరమని ఎంఇఒ ఈరన్న తెలిపారు. శుక్రవారం స్థానిక సీజనల్ హాస్టళ్లను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి ఇంగ్లీష్ వర్క్ బుక్‌లో విద్యార్థుల ప్రతిభను గుర్తించారు. ఇవే తెలివితేటలు భవిష్యత్తులో కొనసాగించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశ చాలా గొప్పదని తెలిపారు. అనంతరం రోజూ మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వంటశాలలో విద్యార్థుల కోసం తయారు చేసి పెట్టిన రాత్రి భోజనాన్ని అన్నం, పప్పు, రసం, మజ్జిగను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ సిహెచ్.నాగరాజు, సిఆర్‌పిలు లక్ష్మప్ప, తుకారాం, ఉపాధ్యాయులు దుర్గయ్య, షోయబ్ పాల్గొన్నారు.

'ధోబీ ఘాట్‌కు నీటి సౌకర్యం కల్పించాలి'

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగిలోని సిద్ధపాలెం శ్మశాన వాటికలో ఉండే ధోబీఘాట్‌కు నీటి సౌకర్యం కల్పించాలని చేతి వృత్తిదారుల సంఘం మండల సమన్వయ కమిటీ నాయకులు వీరేష్, రాముడు, రజక వృత్తిదారుల సంఘం నాయకులు బసన్న, వీరేష్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ధోబీ ఘాట్‌కు నీటి సౌకర్యం లేకపోవడంతో రజక వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ధోబీ ఘాట్‌కు నీటి సౌకర్యం కల్పించి రజక వృత్తిదారులను ఆదుకోవాలని కోరారు.

విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు...

- గుట్కాకు బానిసలై అనారోగ్యం పాలవుతున్న యువకులు - చోద్యం చేస్తున్న సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద మండలంలో గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గుట్కాకు బానిసలై యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారు.

హొళగుంద నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండడంతో అధిక సంఖ్యలో గుట్కా ప్యాకెట్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఏ దుకాణానికి వెళ్లినా తాగడానికి నీరు దొరుకుతుందో, లేదో కానీ గుట్కా ప్యాకెట్లు మాత్రం దర్శనమిస్తాయి. అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి అక్కడక్కడ 1, 2 కేసులు కట్టి చేతులు దులుపుకుంటున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాల వల్ల వ్యాపారులకు అధిక సంఖ్యలో లాభాలు వస్తున్నా, ఎక్కువ శాతం కార్మికులు, యువకులతో పాటు యువతులు, మధ్య తరగతి మహిళలు సైతం బానిసైనట్లు తెలిసింది. నోటి క్యాన్సర్‌తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చి చేరుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నా యువత పెడచెవిన పెడుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి 30 గుట్కా సీట్లు గల ఒక బాక్స్‌ను రూ.100 ప్రకారం కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

రాష్ట్రాల మధ్య కఠిన చర్యల అమలులో తేడాలు

గుట్కా, మత్తు పదార్థాల కార్యకలాపాలపై కఠిన చర్యలు అమలు చేయడంలో రాష్ట్రాల మధ్య తేడాలు ఉండడం వల్ల గుట్కా, మత్తు పదార్థాల అమ్మకందారులు చెలరేగిపోతున్నట్లు సమాచారం. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆదాయమే ధ్యేయంగా పని చేయడం, ఒక రాష్ట్రం గుట్కా అమ్మకాలు చట్ట విరుద్ధం, నిషేధమంటూ ఆదేశాలు జారీ చేస్తున్నాయి. మరో రాష్ట్రం గుట్కా, మత్తు పదార్థాల వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని భావించడం వల్ల యువతతో పాటు మహిళలు కూడా అనారోగ్యం పాలవుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఏ రాష్ట్రం కూడా గుట్కా, మత్తు పదార్థాలను అమ్మి లాభాలను ఆర్జించకూడదని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. పక్కన కర్ణాటక రాష్ట్రంలో గుట్కా ప్యాకెట్లు అమ్ముకోవచ్చని ఆదేశించడం వల్ల బహిరంగంగా మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో గుట్కా, మత్తు పదార్థాలు నిషేధించడం వల్ల రహస్యంగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్కా వ్యాపారులపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- లోకేష్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న హెల్త్ కార్డు, అక్రిడిటేషన్ల మంజూరు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం ఆదోనిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. టిడిపి హయాంలో జర్నలిస్టుల సంక్షేమానికి పాటు పడ్డామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ ప్రెసిడెంట్ బసవరాజు, జనరల్ సెక్రటరీ మునెప్ప, ఉపాధ్యక్షులు విజయ్, మల్లికార్జున, షంషీర్ ఖాన్, పురుషోత్తం, సుధాకర్, రమేష్ రెడ్డి, ట్రెజరర్ సుధాకర్ ఉన్నారు.

లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జాతీయ రహదారిని నిర్మించాలి

- వామపక్షాల ఆధ్వర్యంల రాస్తారోకో

ప్రజాశక్తి-ఆలూరు

గుంతలుగా ఉన్న జాతీయ రహదారిని తక్షణమే నిర్మించాలని శుక్రవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ... ఆలూరులో కొన్నేళ్లుగా జాతీయ రహదారి నిర్మాణం చేపడుతూనే ఉన్నా రహదారిని తొలగించి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పాలకులకు, అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. పట్టణంలో డ్రెయినేజీ, రోడ్డు విస్తరణ చేపడతామని యుద్ధప్రాతిపదికన రోడ్ సైడ్ వ్యాపారుల దుకాణాలు తొలగించి వారి జీవనాన్ని రోడ్డు పాలు చేశారన్నారు. డ్రెయినేజీ, రహదారిని నిర్మించాలని కోరారు. లేకపోతే రోడ్డును దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఎస్ఐ నాయక్ చేరుకొని తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టిస్తామని హామీ ఇవ్వగా రాస్తారోకో విరమించారు. సిపిఎం నాయకులు షాకీర్, గోవర్ధన్, వీరేష్, సిపిఐ నాయకులు హోతూరప్ప, బాషా పాల్గొన్నారు.

ఆలూరు రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్టాపనపై వివాదం

- తువ్వదొడ్డిలో రెండు వర్గాల మధ్య విభేదాలు

- వేర్వేరుగా తేదీలు ముద్రించిన ఆహ్వాన పత్రికలు

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో గ్రూపు రాజకీయాల విభేదాలు, పార్టీల గ్రూపులు ఉండడం సహజం. ఈ విభేదాలు చివరకు దేవాలయాల విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాలకు కూడా విస్తరించాయి. దేవనకొండ మండలం తువ్వదొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో నవగ్రహాల, నాగులప్ప, బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవాలను గ్రామంలోని రెండు వర్గాల వారు ఆహ్వాన పత్రికల్లో వేర్వేరు తేదీలను ప్రచురించడంతో ఏ తేదీలలో ప్రతిష్టాపన కార్యక్రమాలు ఉంటాయనే సందిగ్ధంలో గ్రామ ప్రజలు ఉన్నారు. ఒక వర్గానికి చెందిన వారు ఈనెల 29 నుంచి మే 1 వరకు అని, మరో వర్గం వారు మే 2 నుంచి 4 వరకు ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు జరపనున్నట్లు ఆహ్వాన పత్రికల్లో ముద్రించడంతో గ్రామస్తులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. గ్రామంలో ఈ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఇరువర్గాల మధ్య ఘర్షణకు తావు తీసే పరిస్థితి నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. ముందస్తు చర్యలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసు శాఖ జోక్యం చేసుకొని ఇరువర్గాలను, గ్రామస్తులతో మాట్లాడి వేర్వేరుగా తేదీలు ప్రకటించకుండా ఒక తేదీ ఖరారు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

YEMMIGANUR MUNICIPALITY

e-procurement tender notice

Notice No. 2/General Fund-2023-24/E1, dt.21-04-2023

1	Total No. of Work	Short Tender Notice 1st Call- 3 Nos
2	Value of Work	5.15 Lakhs
3	Bid document download starting date	22-04-2023 at 10.30 A.M
4	Bid document download end date	25-04-2023 at 3.00 P.M
5	Last Date & Time for receipt of Bids	25-04-2023 at 3.30 P.M
6	Commercial Bid opening Date	25-04-2023 at 4.00 P.M
7	Name & Address of the Concerned Officer	Commissioner, Yemmiganur Municipality, Yemmiganur. Ph.No.08512-255050 Fax : 08512-228050 Email: commissioner_ygr@yahoo.com

The details of name of work, Tender document, Eligibility Criteria. Bid Submission & Price Bid opening date and EMD details etc., may be seen on e-procurement market place available @ eprocurement.gov.in

Commissioner
Yemmiganur Muncipality



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జెసి

దారి అంతా రాళ్లు.. గుంతలు..

- అధ్వానస్థితిలో మంగంపేట రహదారి
- నరకప్రాయంగా ప్రయాణం
- పట్టించుకోని అధికారులు

రాళ్లు తేలిన మంగంపేట రహదారి

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు మండలం మంగంపేట రహదారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. రహదారి అంతా గుంతలు పడి రాళ్ల తేలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రహదారిలో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు బేంబేలెత్తిపోతున్నారు. బనగానపల్లె మండలం క్రిష్ణగిరి గ్రామం నుండి మంగంపేట, మంగంపేట తండా, కాశిరెడ్డి నాయన ఆశ్రమం వరకు సుమారు 14 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. బనగానపల్లె నుండి కాశిరెడ్డి నాయన ఆశ్రమ వరకు ఆర్టిసి బస్సును నడుపుతున్నారు. ఆటోలు మంగంపేట వరకు తిరుగుతున్నాయి. క్రిష్ణగిరి నుండి మంగంపేట, మంగంపేట తండా, కాశిరెడ్డి నాయన ఆశ్రమం వరకు మట్టి రోడ్డు ఉంది. ఈ మట్టి రోడ్డు అంతా గుంతలమయం కావడంతో ప్రజలు ఆ రోడ్డులో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులో వెనుక సీట్లో కూర్చుంటే గుంతల వద్ద ఎగిరి టాప్‌కు తగులుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలో ఆ రూటులో ప్రయాణించాలంటే నరకాన్ని తలపిస్తుందని, మొత్తం దుమ్ము కొట్టుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. తమ గ్రామానికి రోడ్డు వేయాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేస్తుంటే నడుము నొప్పులు వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. క్రిష్ణగిరి నుండి కాశిరెడ్డి నాయన ఆశ్రమం వరకు గతంలో బిటి రోడ్డు మంజూరు అయింది. అయితే రాజకీయ కారణాలతో ఆ రోడ్డును వేయలేదు. దీంతో మంగంపేట, మంగంపేట తండా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి నిత్యం భక్తులు అధికంగా వస్తుం టారు. మంగం పేట, మంగంపేట తండాల నుండి బనగానపల్లెకు రావడానికి ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు సక్రమంగా లేకపో వడంతో ఇబ్బందులు పడుతు న్నారు. మట్టి రోడ్డు, దానికి తోడు గుంతల మయం కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. మోటార్ సైకిల్ టైర్ల కింద రాళ్లు పడి స్లిప్ అయ్యి కింద పడి గాయాలపాలవుతున్నారు. ఎవరైనా తమ గ్రామానికి పెళ్లి చూపులకు రావలన్నా రహదారిని చూసి వెనక్కి వెళ్లిపోతున్న పరిస్థితి ఉందిన మంగంపేట, తండా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు వేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్డులో ప్రయాణించాలంటేనే భయంగా ఉంది

- దేవేంద్ర ఆచారి మంగంపేట

మంగంపేట రహదారిలో ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. రోడ్డు గుంతల మయంగా మారి, దుమ్ముతో ఆ రోడ్డులో ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. ద్విచక్ర వాహనదారులు ఆ రోడ్డులో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందిగా ఉంది.

రహదారిని బాగు చేయండి

- మోహన కృష్ణ, మంగంపేట

మంగంపేట రహదారిని బాగు చేయాలి. మా గ్రామం నుంచి సంబంధం కలుపుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. మా గ్రామానికి వచ్చిన వారు రహదారిని చూసి పిల్లల్ని ఇవ్వకుండా పోతున్నారు. అధికారులు, రాజకీయ నాయకులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా రోడ్డును బాగు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

పిఒఎల్ఆర్ సర్వే వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కింద పెండింగ్‌లో ఉన్న సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ తహశీల్దారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిఒఎల్ఆర్ రీ సర్వే, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై జెసి టి.నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బండి ఆత్మకూరు, చాగలమర్రి, ప్యాపిలి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పిఒఎల్ఆర్ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాల న్నారు. జిల్లాలో రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని మండల సర్వేయర్లను, ల్యాండ్ అండ్ సర్వే ఎడి శ్రీరామ్ ను ఆదేశించారు. జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, బనగానపల్లి, తదితర మండలాల్లో గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల కోసం స్మశాన వాటికలను గుర్తించి వారం రోజుల్లో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అసైన్మెంట్ ల్యాండ్ డి మార్కింగ్ సంబంధించి సిరివెళ్ల 6.7 ఎకరాలు, బేతంచర్లలో 30 ఎకరాలు, ప్యాపిలిలో 70 ఎకరాలు, పాములపాడులో 30 ఎకరాలు పెండింగ్లో ఉందని ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని కలెక్టర్ సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. మిడుతూరు, శ్రీశైలం, బండి ఆత్మకూరు, బేతంచెర్ల, బనగానపల్లి తదితర 11 మండలాలకు హౌసింగ్ డేటా వివరాలను సమర్పించాలన్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి స్పందన గ్రీవెన్స్ అనాలసిస్ చేసి ఏపి సబ్జెక్టుపై ఏపి సచివాలయం నుండి అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయో అన్వేషించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి మాట్లాడుతూ చెంచుగూడెంలలో పెండింగ్‌లో వున్న రేషన్ కార్డులను పంపిణీ చేయాలని డిఎస్ఓను ఆదేశించారు. ఆధార్ డేటా నమోదు ప్రక్రియకు సంబంధించి అనుమానాలు ఉంటే డిఎల్డిఓతో నివృత్తి చేసుకోవాలన్నారు. ఆళ్లగడ్డలో సర్వేయర్లు సెలవులో వెళ్లిపోయిన అంశంపై చర్యలు తీసుకోవాలని సంబంధిత తహశీల్దార్‌ను ఆమె ఆదేశించారు. రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన వివరాలు పంపాలని, పర్యాటక ప్రాంతాలు, జాతీయ రహదాలకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసులకు సంబంధించి కంటెంట్ రాకుండా కౌంటర్ ఫైల్ చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జి డిఆర్ఓ కామేశ్వరరావు, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, ఎం దాసు, తహ శీల్దార్లు సంబంధిత కార్యాలయాల నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీస్ సిబ్బంది నుండి వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి తెలిపారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం నంద్యాల జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయంలో శపోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న12 మంది పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి జిల్లా ఎస్పీ భరోసా కల్పించారు. సిబ్బంది యొక్క ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ దస్తగిరిబాబు ఎస్పీ సిసి నాగరాజు పాల్గొన్నారు.

నంద్యాల ఎంపీ కాన్వాయ్‌ని అడ్డుకున్న రైతులు

- జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎంపి
- గ్రామసభ జరుపుతామనే హామీతో ఆందోళన విరమణ

ఎంపితో మాట్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జమ్ములమడుగు జాతీయ రహదారి కోసం తమ భూములు లాక్కోవాలనే నిర్ణయాన్ని నిరసిస్తూ శుక్రవారం కానాల, రైతు నగరం గ్రామాల రైతులు నంద్యాల జిల్లా కోవెలకుంట్ల నంద్యాల రహదారి పైన రాస్తారోకో చేపట్టారు. నంద్యాల నుండి కోవెలకుంట్ల వైపుగా వెళుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కాన్వాయ్‌ని రైతులు, సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు అడ్డుకున్నారు. తమ భూముల్లో అధికారుల సర్వేను ఆపాలని కోరారు. ప్రభుత్వం మొదట సూచించిన ప్రకారం కాకుండా, రియల్ ఎస్టేట్ భూములను, అధికార పార్టీ నాయకుల భూములు కాపాడటానికే అలైన్‌మెంట్ మార్చి వేరే పద్ధతుల్లో పేద రైతుల భూముల్లో రహదారి కోసం సర్వే చేపడుతున్నారని, తక్షణమే సర్వే పనులు ఆపాలని బాధిత రైతులు, రైతు సంఘం నాయకులు ఎంపిని నిలదీశారు. సర్వే పనులు ఆపే వరకు ఆందోళన విరమించబోమని రైతులు భీష్మించి కూర్చున్నారు. దీంతో ట్రాఫిక్ స్థంభించిపోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళన కారులకు, రైతులకు ఎంత సర్ది చెప్పినా వినలేదు. సర్వే పనులు ఆపితేనే కాన్వాయ్‌కి అడ్డు తప్పుకుంటామని రైతులు మొండికేశారు. చివరకు ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి నేరుగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో ఫోన్లో మాట్లాడారు. నంద్యాల నుండి జమ్ములమడుగు వరకు జాతీయ రహదారి 167 కె నిర్మాణం కోసం భూసేకరణకు చేపడుతున్న జాతీయ రహదారి సర్వే పనులు ఆపాలని సూచించారు. సర్వే పనులు ఆపుతామని, ప్రత్యామ్నాయం కోసం గ్రామసభ జరిపీ భూసేకరణ పనులు చేపడుతామని ఎంపీ పోచా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎంపీ హామీతో తాత్కాలికంగా ఆందోళన విరమిస్తున్నామని, హామీ అమలు జరిగే వరకు కుల మతాలకతీతంగా, రాజకీయాలకతీతంగా రైతులందరం కలిసి పోరాడుతామని రైతులు రైతు సంఘం నాయకులు తెలిపారు. రైతులు చేపట్టిన ఆందోళనకు సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ప్రత్యక్షంగా రైతుల ఆందోళనలో గత రెండు రోజులుగా రైతులకు ఎర్ర జెండా అండగా ఉందని భరోసా ఇస్తూ రైతులకు వెన్నంటూ ఉండి ఆందోళనను నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన ఆందోళనలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, సిపిఎం నాయకులు నరసింహ, బాలవెంకట్, నిరంజన్ పాల్గొన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ఆందోళన ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

ప్రభుత్వం వేస్తున్న రహదారికి తాము వ్యతిరేకం కాదని కానీ అధికారులు ముందుగా ప్లాన్ చేసిన ప్రకారం కాకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, భూస్వాములు, అధికార పార్టీ నాయకుల భూములను కాపాడేందుకే ప్లాన్ మార్చి కేవలం ఎకరా, రెండు ఎకరాల లోపు భూములున్న పేద రైతుల భూముల మధ్యలో రహదారి వచ్చే విధంగా సర్వే చేస్తున్నారని ఎంపి దృష్టికి తెచ్చామన్నారు. పేదలకు నష్టం తగ్గే విధంగా, ప్రభుత్వంపై భారం తగ్గే విధంగా ప్రత్యామ్నాయంగా ఉన్న ప్రభుత్వ భూమిలోని రహదారి కిరువైపులా భూసేకరణ చేసి పేద రైతులకు మేలు చేసే విధంగా ప్లాన్ రూపొందించాలని అనేకమార్లు సంబంధిత అధికారుల ముందు మొరపెట్టుకున్నా తమ సమస్యను పరిష్కారం చేయడం లేదన్నారు. గత్యంతరం లేకనే రైతు సంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై కూర్చున్నామని రైతులు తెలిపారు. ఎంపీ వెంటనే జోక్యం చేసుకొని అధికారులు చేపట్టే సర్వే పనులు నిలిపి వేయాలని, భూములు పోతున్న గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. 2013 కేంద్ర ప్రభుత్వ భూసేకరణ చట్టాన్ని అమలు జరిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

1 నుండి 'వియ్‌లవ్ రీడింగ్' : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా పఠనాసక్తిని పెంపొందించుకుని అదనపు పరిజ్ఞానాన్ని అర్జించేలా "వియ్ లవ్ రీడింగ్" కార్యక్రమాన్ని అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఇందుకోసం విద్యార్థులను సమాయత్తం చేయాలన్నారు.అందుకు సంబందించి పాఠశాల విద్యాశాఖ కమీషనర్, ఎస్. సురేష్ కుమార్ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించారని దీని ప్రకారం మే 1 నుంచి జూన్ 10 వ తేదీ వరకు కొనసాగించాలని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులను డీఈఓ ఆదేశిం చారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఉప విద్యాశాఖా ధికారులు, మండల విద్యాశాఖాధికారులు సమావేశం నిర్వహించి ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి వినూత్న వ్యూహాలను రూపొందించవాలని ప్రకటనలో వెల్లడించారు.

ఇఫ్తార్ విందులో విజయ మిల్క్‌డైరీ చైర్మన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని దివ్యజ్ఞాన మందిరంలో ముస్లిం సోదరులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసంలో ఉన్న ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన డం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దివ్యజ్ఞాన మందిరంలో మదరసాను నిర్వహిస్తూ చిన్నారుల భవిష్యత్తుకు పాటుపడుతున్నారని ఆయన కొనియాడారు. శనివారం జరిగే రంజాన్ పండుగను అందరూ సుఖసంతో షాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఖలిపాలు హుస్సేన్ భాష, ముస్తాక్, జాకీర్, రషీద్, ఖాజా , హఫీజ్ మహమ్మద్ హుస్సేన్ తో పాటు గౌస్, జోహారుద్దీన్, రంసుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - నంద్యాల

జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై మోడీ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ ఈనెల 24న విజయవాడలోని జింఖానా గ్రౌండ్లో చేపట్టే జై భారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలిన నంద్యాల కాంగ్రెస్ కమిటీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య పేర్కొన్నారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకోటూ వాసు, జిల్లా కోశాధికారి ఎస్ వై డి ప్రసాద్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కరాటే బాలకృష్ణ, మైనారిటీ నాయకులు చాబోలి సలాం, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు

బిజెపిని ఓడిద్దాం 'ఉపాధి'ని రక్షించుకుందాం

ప్రచారం నిర్వహిస్తున్న సిపిఐ సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

బిజెపిని ఓడిద్దాం జాతీయ గ్రామీణ ఉపాధి హామీని రక్షించుకుందాం అని సిపిఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్, సిపిఐ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని మండల నాయకులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిధులు తగ్గించి గ్రామీణ పేదల కూలీల పొట్టకొడుతున్నారన్నారు. గ్రామీణ పేద కూలీలకు ఉపాధి లేకుండా మరింత పేదలాగా చేసింది కావున తక్షణమే కేంద్ర ప్రభుత్వం రెండు పూటలు పనిని రద్దు చేసి, పాత పద్ధతి కొనసాగించాలన్నారు. గ్రామీణ కూలీలు ఐక్యంగా ఉద్యమాలు చేయాలన్నారు. ఉపాధి హామీ నిధులు పెంచి, రూ.600 కూలీ ఇవ్వాలి, 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, పార్లమెంటులో చట్టం చేయాలి, రుణ విమోచన చట్టం తీసుకురావాలన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికి కౌలు కార్డులు ఇవ్వాలి, కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఏ.రణధీర్, మండల నాయకులు సుధాకర్, మా బాష, సిపిఐ మండల నాయకులు ప్రతాప్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ప్రజా వ్యతిరేక నిరంకుశ, మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్య, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వై.ఎల్లయ్యలు అన్నారు. పట్టణంలో ప్రచార భేరి పాదయాత్ర రెండవ రోజు కొనసాగించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వై.బి. వెంకటేశ్వర్లు,పార్టీ పట్టణ కమిటి సభ్యులు నరసింహుడు, నాగరాజుల అధ్యక్షతన మూడు దళాలుగా ఏర్పడి డ్రైవర్స్ కాలనీ,అల్లాభకాష్ దర్గా, కోటపేట, తాసిల్ పేట,అమ్మవారిశాల,గౌరీపేట,బైటిపేట, కొలుము లపల్లి ట్యాంక్‌ఏరియా, ముద్ద వరం సత్రం ఏరియా,అంగల్ల బజారు,పాత ఎమ్మార్వో ఆఫీస్ లైన్, జండా పేట, పెద్దమజీద్ ఏరియాలలో గడపగడపకు తిరిగి కరపత్రా లు పంపిణీ చేశారు. అనంతరం అర్.ఈశ్వరయ్య,వై. ఎల్లయ్యలు మాట్లాడారు. సిపిఎం నాయకులు కావేటి రాజబాబు, వెంకటరమణ,ఎస్.కె.బాష, కావేటి చిన్ని వెంకటేశ్వర్లు, అంకాలు, బక్కన్న,చిన్నబ్బి,మద్దయ్య,కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బేతంచెర్లలో..

ఆర్‌టిసిని అభివృద్ధి పథంలో నడిపిస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కోవెలకుంట్ల

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, జడ్పి చైర్మన్, తదితరులు

కోయిలకుంట్ల ఆర్టిసి సంస్థను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తామని బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో 61 లక్షల రూపాయలతో నూతనంగా ఆధునికరించిన ఆర్టీసీ బస్ స్టాండ్‌ను శుక్రవారం బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎపి ఆర్టీసి చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి, ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావులు ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ఎమ్మెల్యే తన ఖర్చుతో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ చల్లని వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ బస్ స్టాండ్‌ను పరిశీలించి గ్యారేజ్‌ను పరిశీలించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1986లో ప్రారంభం అయిన ఆర్టీసీ బస్ స్టాండ్ పూర్తిగా శిధిలావస్థకు చేరుకొని ఉండేదని, నేడు కొత్తహంగులతో ప్రారంభించు కోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పార్లమెంటు సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డిలు మాట్లాడారు. అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఖాళీ స్థలాలను లీజ్‌లకు ఇచ్చి ఆదాయ వనరులను పెంచుకోవడం జరుగుతు ందని చెప్పారు. ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 2,700 నూతన బస్సుల మంజూరుకు సిఎం ఆమోదం తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఇరిగేషన్ చైర్మన్ కర్రా గిరిజా రెడ్డి, ఈడివో బ్రహ్మానంద రెడ్డి, ఈడి గోపీనాథ్ రెడ్డి, ఈఈ వెంకట రమణ, ఆర్ఎం శ్రీనివాసులు, డివైఇఇ శ్రీనివాస రావు, డిఎం తిరుపతయ్య, అవుకు మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైయస్సార్ పార్టీ నాయకులు కర్రా హర్షవర్ధన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బివి నాగార్జున రెడ్డి, పట్టణ ఉప సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, కాంట్రాక్టర్ ఎల్‌వి సుధాకర్ రెడ్డి, సప్తగిరి నాగేశ్వర్ రెడ్డి, పొట్టిపాడు శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవి రెడ్డి, ఏపీ ఎన్జీవో ఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణా రెడ్డి, కోవెలకుంట్ల మండల వైఎస్సార్ పార్టీ కన్వీనర్ భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

- జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ నంద్యాల జిల్లా పోలీసు శాఖ తరుపున జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అందరు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. నంద్యాల పట్టణంలో జిల్లాలో ప్రతి ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఈద్గా వద్ద ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూసుకోవాలని పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సంబందిత ఎస్‌డిపిఓలకు ఆదేశాలు జారీచేశారు. ల సందర్భంగా ప్రజలను మోసం చెయ్య డానికి ఫెస్టివల్ ఆఫర్ లని మెసేజ్‌లు ,ఈ మెయిల్ లింక్‌లు మొదలగునవి పంపి సైబర్ నేరగాళ్ళు సైబర్ నేరాల కు పాల్పడే అవకాశం ఉంటుందని సైబర్ మోసాల భారిన పడకుండా జాగ్రతగా ఉండాలని ఎస్పీ సూచించారు.

ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తున్న డిఎంహెచ్ఓ

ఆరోగ్యశ్రీకి రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు : డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఆరోగ్యశ్రీ కలిగి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆరోగ్యశ్రీ కేసులకు రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ఆస్పత్రిలో యాజమాన్యాలను హెచ్చరించారు. శుక్రవారం నంద్యాల జిల్లాలో ఉన్నటువంటి ఆరోగ్యశ్రీ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఆర్.వెంకటరమణ జిల్లా సర్వజన ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కలిగిన ఆసుపత్రులు బయట కేసులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కేసుల నుండి ఎటువంటి రుసుము వసులు చేయరాదన్నారు. అలా కాకుండా ప్రభుత్వ నిభంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరిగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశములో నెట్ వర్క్ ఆసుపత్రులు డాక్టర్లు, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ శ్రీధర్, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు ఆరోగ్య మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నంద్యాల బుడతడు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



నంద్యాల అష్టలక్ష్మి టెంపుల్ ప్రాంతానికి చెందిన సేవల శివ, స్వప్నిక ల కుమారుడు సేవల మోక్ష అయాన్ (23 నెలలు) అనే బుడతడు తన అపార బాల మేధస్సుతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎక్కనున్నాడు. 37 రకాల జంతువులను, ఎందరో జాతీయ నాయకులను గుర్తించడంతో పాటు వివిధ శబ్దాలను అనుసరించడం వంటి అద్భుతాలను చేస్తున్నాడు. సాఫ్ట్వేర్ ఇంజనీర్లైన తల్లిదండ్రులు ఈ ప్రతిభను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులకు పంపించారు. వారు తగిన స్టాండర్డ్స్ మేరకు చేసిన పరీక్ష ల అనంతరం ఈ బుడతడి ప్రతిభను అధికారికంగా గుర్తిస్తూ సర్టిఫికెట్‌ను, మెడల్‌ను ప్రధానం చేశారు. రాబోయే ఎడిషన్ (2023)లో మోక్ష అయాన్ రికార్డు ప్రచురణ అవుతుంది.

ఎమ్మెల్యే ఆర్థర్ కు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

గెలిపించాం గాని అభివృద్ధి లేదు

- 'గడపగడపకు'లో.. ఎమ్మెల్యేకు సమస్యల వెలువలు

ప్రజాశక్తి - పగిడ్యాల

గెలిపించాముగాని ఎటువంటి అభివృద్ధి లేదని నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముందు గ్రామస్తులు పెట్టుకున్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మా పురం గ్రామంలో ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోకి గడప గడప పర్యటిస్తుండగా ఒకదాని వెంట ఒకటి గ్రామస్తులు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గెలిచినప్పటి నుంచి ఎటువంటి అభివృద్ధి లేదు డిగ్రీలు పీజీలు చేసిన ఇంతవరకు జాబ్ క్యాలెండర్ లేక నిరుద్యోగులుగా మిగిలిన మని గ్రామానికి చెందిన కొంతమంది నిరుద్యోగులు ఎమ్మెల్యేను నిలదీశారు. బీసీ కాలనీలో నీటి సమస్యను ఎమ్మెల్యేకు చెప్పగా పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. మైనార్టీ కాలనీలో డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టాలని, కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి, భోజనాన్ని పరిశీలించి, పిల్లలతో సరదాగా కాసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఎస్సై నాగార్జున, ఏపీఎం శ్రీనివాసులు, పి ఆర్ ఏ ఈ వెంకటేశ్వర్లు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సగినేల రమణ, వైసిపి నాయకులు భూషిగౌడు, రామకృష్ణ వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ రామకష్ణ రెడ్డి

శ్రీరామకృష్ణ కళాశాలలో సృజన శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల

అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను శ్రీకృష్ణ దేవరాయ యూనివర్శిటీ, శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల సంయుక్తంగా శుక్రవారం ఎంట్రప్రెన్యూర్ షిప్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ, ఇన్నోవేటర్ డా.శివకిరణ్ హాజర య్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సర్ జి.హేమంత్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కల్పించారు. చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కె.బి.వి సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్ఆర్‌కె ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ సహాయంతో స్టార్టప్ సెంటర్లను ఏర్పాటు చేయడమే ప్రధాన ధ్యేయమన్నారు. అనంతరం శివకిరణ్ ప్రసంగిస్తూ సృజన స్రవంతి మాల రాయలసీమ ప్రాంతంలో మొదటిసారిగా శ్రీ రామకృష్ణా డిగ్రీ అండ్ పిజి కాలేజిలో మొదటి ఇంక్యుబేషన్ సెంటర్ ఉందని అన్నారు. అనంతరం శివకిరణ్‌కి సన్మానం చేసి, విద్యార్థులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.

పెళ్ళికానుక అందజేసిన బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పెళ్లి కానుక అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

పట్టణంలోని ఈద్గా నగర్‌కు చెందిన ఖాజామోహిద్దీన్ కుమార్తె వివాహం సందర్భంగా శుక్రవారం పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పెళ్లి కానుకను అందజేశారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వివాహం చేసుకోనే నూతన వధువులకు ఉచితంగా పెళ్లి కానుక అందజేయడం జరుగుతుందన్నారు. కానుకలో పెండ్లి కుమార్తెకు పట్టుచీర, పెండ్లి కుమారుడికి సర్ట్, పాయింటు ఉంటాయన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఈ పెళ్లి కానుక అందజేయనున్నట్లు తెలిపారు. వధువు తరపున పెళ్లి కార్డు తీసుకొని వచ్చి తనను సంప్రదిస్తే వారికి పెళ్ళికానుకను అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, కాపులపల్లి మద్దిలేటి రెడ్డి, శేషారెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం వెంకట్రామిరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు రాయలసీమ సలాం, నుసి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

- డాక్టర్ రమేష్

ప్రజాశక్తి - మహానంది

మండలం గాజులపల్లె గ్రామంలోని ముస్లిం సోదరులకు, మండల ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ రమేష్ శుక్రవారం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం పవిత్రమైనదన్నారు. రంజాన్ మాసంలో పేద వారికి సాయం చేస్తూ రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

చలువ పందిళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-డోన్

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలవ పందిర్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం డోన్ పట్టణంలోని కర్నూలు రైల్వే గేట్ల ప్రాంతంలో,నంద్యాల రైల్వే గేట్ల ప్రాంతంలో,బేతంచెర్ల రోడ్డు ప్రాంతంలో చలవ పందిర్లను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృశ్య గేట్లు వేసినప్పుడు ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో మున్సిపల్ చలువ పందిర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంక టేశ్వర్లు, ఏఈ జనార్ధన్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొట్రికె. హరికిషన్, ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్ లు మల్లికార్జున్ రెడ్డి,నాగేంద్ర, దార.హరినాథ్ రెడ్డి,కో ఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు,వైఎస్ఆర్ పార్టీ నాయకులు భాస్కర్,సతీష్,వడ్డే రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చలువ పందిర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ఆదివాసి హక్కులను కాపాడుకుందాం

ప్రజాశక్తి-డోన్

ఆదివాసీ హక్కులను కాపాడుకుందామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా పార్టీ నాయకులు కె.రంగనాయకులు పేర్కొన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా పార్టీ నాయకులు రంగనాయకులు మాట్లాడుతూ 1947 పూర్వం నుండి నేటి వరకు ఆదివాసీల అస్తిత్వం మనుగడల గురించి చర్చ జరుగుతూనే ఉందన్నారు. నాటి నుండి నేటి వరకు గిరిజనేతర భూస్వాములు ఆదివాసులను దోచుకుంటూనే ఉన్నారన్నారు. బిజెపి ప్రభుత్వం 2022 అటవీ సంరక్షణ చట్టం తెస్తే రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకుండా కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించి ందన్నారు. 33 శాతం ఉన్న ఆదివాసీల ప్రజల జాబితాలో బోయ వాల్మీకి బెంతు ఒరియా కులాలను చేరిస్తే ఆదివాసులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోయవాల్మీకి బెంతు ఒరియా కులాలను కేటగిరి కింద తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ కులాల వారికి సపరేటు రిజర్వేషన్ కల్పించి తీర్మానం చేయాలన్నారు. ఏదైతే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసిందో దాన్ని వెంటనే ఉపసంహరిం చుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు దొరపల్లె రాజు, ఐఎఫ్ టియు నాయకులు మల్లికార్జున,కృష్ణారెడ్డి,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా పార్టీ నాయకులు కె.రంగనాయకులు

రంజాన్ తోఫా పంపిణీ

శుభం విల్లాస్ ఆధ్వర్యంలో ..

రుద్రవరం: సరుకులు పంపిణీ చేస్తున్న కొమ్మలపాటి రాజారావు

ప్రజాశక్తి-డోన్

నిరుపేద ముస్లిం కుటుంబాలకు శుభం విల్లాస్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేసినట్లు శుభం విల్లాస్ హెూమ్ డెవలపర్స్ పార్టనర్ కొంగాటి. ప్రశాంత్,మేనేజింగ్ పార్టనర్ ఆర్.కె.అర్జున్ రెడ్డిలు తెలిపారు. వారు మాట్లాడుతూ సమాజంలో తమ వంతు సేవలు అందించడంలో ముందు ఉంటామని తెలిపారు. డోన్ పట్టణంలో రంజాన్ పండుగ సందర్భంగా 20 నిరుపేద కుటుంబాలకు పండగకు సరిపడా సరుకులను అందించారు. రంజాన్ తోఫా తీసుకున్న వారు శుభం హోం డెవలపర్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. శుభం హోం డేవెలే పర్స్ యాజమాన్యం చంద్ర, ద్రోణాచలం సేవా సైనికులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలోని ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినం సందర్భంగా నంద్యాల పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు రంజాన్ తోఫా సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ పండుగ సందర్భంగా పేదముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా సరుకులు చక్కెర, బియ్యము, గోధుమపిండి, ఆయిల్, సేమియా, సరుకులతో పాటు కొంత నగదును పేద కుటుంబాలకు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో బాగా ఈ ఏడాది కూడా రంజాన్ తో సరుకులను పేద ముస్లిం సోదరులకు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 6సంవత్సరాల నుంచి రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు రంజాన్ తోఫా సరుకులు పంపిణీ చేస్తూ వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మలపాటి పౌలు, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జగజ్జనని నగర్ లో నిరుపేద ముస్లిం దివ్యాంగులకు, నిరుపేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా, చీరలు పంపిణీ చేసిన్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకులు డిపి మస్తాన్ వలి పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా వన్ టౌన్ సిఐ కృష్ణయ్య హాజరై ఆయన చేతుల మీదు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు లక్ష్మీకాంతం, సభ్యులు కిరణ్ కుమార్, సలహాదారుడు నబి రసూల్, సుభాష్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు సయ్యద్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : మాజీ శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి సతీమణి గంగుల ఇందిరమ్మ రంజాన్ తోఫా కిట్లను ముస్లిం కుటుంబాలకు అందజేశారు. స్థానిక సద్దాం కాలనీలోని మసీదులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఆమెతోపాటు చింతకుంట్ల వైకాపా నాయకులు ఇంగేటి నాగిరెడ్డి, ఇంజేటి సిరి చందన దంపతులు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు పెద్దలకు దుస్తులు అందజేసిన భూమా కిషోర్ రెడ్డి

రంజాన్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని తాలూకా బిజెపి బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి మసీదు పెద్దలకు నూతన వస్త్రాలు అందజేశారు. పట్టణంలోని పలు మసీదులకు వెళ్లి మసీదు పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్ రెడ్డి, సర్వాయి పల్లె రాజా తదితరులు పాల్గొన్నారు.

అవుకు: పట్టణంలో ముస్లిం కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు ఉచితంగా 100 ప్యాకెట్ల బియ్యాన్ని అబ్దుల్లా అండ్ కంపెనీ స్టోన్ ఇండస్ట్రీస్ కు చెందిన యువ పారిశ్రామికవేత్తలు షేక్ రసూల్, షేక్ రఫీ షేక్ చాంద్ బాషా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

బండి ఆత్మకూరు: పలువురు అభాగ్యులకు వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు రఫీ ఎస్ఐ బాబు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. రంజాన్ పండుగ పురస్కరించుకొని ఆయన తమ వంతు సాయంగా అందజేన్నట్లు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ రంజాన్ పండుగ పురస్కరించుకుని అభాగ్యులకు సాయం అందించడం సంతోషకరమన్నారు. ఆనంతరం ముస్లిమ్ యువకులు ఎస్ఐని సన్మానించారు. ఇలియాస్,రఫీ, రోషన్,నషిబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : రంజాన్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల రూరల్: రంజాన్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1 నుండి 7వ తేదీ వరకు అన్ని చోట్ల జెండాలను ఎగురవేస్తూ నంద్యాల పట్టణంలో నిర్వహించే వారోత్సవాలను జయప్రదం చేయాలని, దానికోసం అవసరమైన ఏర్పాట్లను చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ కే మహమ్మద్ గౌస్ అన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు పట్టణ కార్యాల యంలో పట్టణ కమిటీ సమావేశం సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట మద్దులు, శ్రీనివాసమూర్తి, కోశాధికారి వెంకట లింగం, సహాయ కార్యదర్శులు షమీం, సునీత, గోపాల్, పట్టణ నాయకులు నాగరాణి, రమేష్ ,లాలా హుస్సేన్, సెల్వరాజ్, ఆంజనేయులు, పెద్దన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పోరాడి సాధించుకున్న హక్కులను నేడున్న పెట్టుబడిదారీ సమాజంలో ప్రభుత్వాలన్నీ అనుకూలం గా పెట్టుబడుదారుల కోసం పనిచేస్తున్నాయని, కార్మికుల హక్కులను కాల రస్తూ కార్మికులను నయా బానిసలుగా చేసే విధానాలను తీసుకొస్తున్నా యని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సి ఐ టి యు నాయకులు

నీళ్లు, నిధులు, నియామకాలకోసం ఉద్యమిద్దాం..

- రాయలసీమ స్టీరింగ్ కమిటీ

ప్రజాశక్తి - మహానంది

రాయలసీమకు నీళ్లు, నిధులు, నియమాల కోసం ఉద్యమిద్దామని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి, చింతకుంట ప్రతాప్ రెడ్డిలు అన్నారు. శుక్రవార మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమను కరువు కోరల్లోకి నెట్టే అక్రమ ఎగువ భద్ర ప్రాజెక్టును ఆపాలని, రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాలు సమానంగా కేటాయించాలన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో ఈ నెల 24న కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో చేపట్టే రాయలసీమ కర్తవ్య దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చాకని గోపాల్ రెడ్డి, బి. వెంకటరమణ, జి. నరసింహులు, కె. నరప్ప, బోయ పెద్ద బాలయ్య తదితరులు పాల్గొని కరపత్రాలు ఇంటింటికి పంపిణి చేశారు.

బండి ఆత్మకూరు: ఈ నెల 24 నిర్వహించే రాయలసీమ కర్తవ్య దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం.వి.రమణారెడ్డి, మండల నాయకులు సీమ అంకిరెడ్డిలు కోరారు. శుక్రవారం వారు మండల కేంద్రం బండి ఆత్మకూరులో రాయలసీమ కర్తవ్యదీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీమ ఎరుకలిరెడ్డి, బండి శివారెడ్డి, ఓబుళకొండారెడ్డి, గురువయ్య, గోరెసాహెబ్, నాగేంధ్రుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి - అవుకు

పరిసరాల పరిశుభ్రత అనారోగ్యాలు రాకుండా, ఆరోగ్యంగా ఉండొచ్చునని ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా అవుకు పట్టణంలోని మార్కెట్ సమీపంలో ఉన్న మురికి కాలువల్లో నిల్వ ఉన్న నీటిపై ద్రవణాన్ని ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు చల్లారు. ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ రెడ్డి ఫ్రైడే కార్యక్రమం పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సిబ్బందికి తగిన సూచనలను సలహాలను అందించారు. మార్కెట్ కాలనీవాసులతో డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో నీటిని నిలువ లేకుండా చూసుకోవాలని పాడైన వస్తువులలో నీరు నిలువ ఉన్నప్పుడు వాటిని తీసివేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిచికెన్ గున్యా మెదడు వాపు వ్యాధి వంటి వ్యాధులు ప్రబులుతాయని తెలిపారు. కావున ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'భవిష్యత్ రాయలసీమ - మన దృష్టి కోణం' పై సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల

రాయలసీమ ప్రజాసంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో 'భవిష్యత్తు రాయలసీమ - మన దృష్టి కోణం' అంశంపై శుక్రవారం అంతర్జాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ ప్రజా సంఘాలు సుదీర్ఘకాలంగా చేస్తున్న రాయలసీమ ఉద్యమాన్ని విశ్లేషించుకుంటూ, వర్తమాన, భవిష్యత్తు పరిస్థితుల, పరిణామాల నేపథ్యంలో ఉద్యమ కార్యాచరణపైన చర్చ నిర్వహించారు. రాయలసీమ ప్రజాసంఘాల సమన్వయ వేదిక కన్వీనర్ బొజ్జా దశరథ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాయలసీమ, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన ఏడవ వార్షికోత్సవం మే 31, 2023 న సిద్దేశ్వరం వద్ద ఘనంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ అరుణ్, విద్యావంతుల వేదిక అనంతపూర్ బాధ్యులు రాజశేఖరరెడ్డి, వెంకటేష్, విద్యావంతుల వేదిక కడప బాధ్యులు పద్మ, మహమ్మద్, వేమన అధ్యయన కేంద్రం అధ్యక్షులు అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి, గాడిచర్ల హరి సర్వోత్తమ రావు ట్రస్ట్ బాధ్యులు చంద్రశేఖర్ కల్కూర, అనంతపురం జలసాధన సమితి కన్వీనర్ శ్రీనివాసులు, కడప జిల్లా రైతు సంఘం నాయకులు సహదేవ రెడ్డి, రాయలసీమ సాంస్కృతిక వేదిక కో కన్వీనర్ రవి కుమార్, చేతన సంస్థ అధినేత గంగిరెడ్డి, ఒపిడిఆర్ నాయకులు రాంకుమార్, ప్రముఖ పాత్రికేయులు వనం (పెన్నేరు) శర్మ, రవి, రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు ఏర్వ రామచంద్రారెడ్డి, సాగునీటి సాధన సమితి వత్తి నిపుణుల విభాగం బాధ్యులు డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, సాగునీటి సాధన సమితి నంద్యాల జిల్లా బాధ్యులు వై ఎన్ రెడ్డి, సాగునీటి సాధన సమితి కర్నూలు జిల్లా బాధ్యులు రామకృష్ణా రెడ్డి, సాగునీటి సాధన సమితి చిత్తూరు జిల్లా బాధ్యులు రాంబాబు, సాగునీటి సాధన సమితి ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు, నంద్యాల పట్టణ రైతు విభాగం బాధ్యులు కొమ్మా శ్రీహరి, డిటిఎఫ్ నాయకులు రత్నం ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సచివాలయాల పనితీరుపై అవగాహన

ప్రజాశక్తి-డోన్

విద్యార్థులకు సచివాలయాల పనితీరుపై అవగాహన కల్పించినట్లు పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావ తమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డిలు తెలిపారు. శుక్రవారం డోన్ పట్టణంలోని పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వొకేషనల్ విద్యార్థులకు విజిట్ ప్రోగ్రాం క్రింద సచివాలయ సందర్శన చేయడం జరిగింది. ఈ ప్రోగ్రామ్ క్రింద విద్యార్థులకు ఆయా సచివాలయ ఉద్యోగులు అడ్మిన్,వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరుల ద్వారా వారి విధుల గురించి వివరించారు.వఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విద్యార్థులు బయటి ప్రపంచంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మి కాంతరెడ్డి,వత్తి విద్య పర్యవేక్షకులు అల్లిపీరా, మహేష్, పాతపేట సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు చర్యలు

చాగలమర్రి: గ్రామాలలో పారిశుధ్యము మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఈఓపిఆర్‌డి నాగేంద్రయ్య తెలిపారు. మండలంలోని మద్దూరు, పెద్దవంగలి,శెట్టివీడు,గొడెగనూరు మల్లెవేముల, చిన్నవంగలి, పెద్దబోధనం, చింతలచెరువు తదితర సచివాలయాల పరధిలోని గ్రామా లలో శుక్రవారం డ్రై డే సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యం లో ఓవర్‌హెడ్ ట్యాంకులు,మినీ ట్యాంకులను శుభ్రపరచి బ్లీచింగ్ చల్లారు. మురికి కాలువలను శుభ్రపరచి,నీరు నిల్వ ఉన్న చోట వేస్ట్‌ఆయిల్,బ్లీచింగ్ పౌడర్ చల్లారు.ఈ సందర్భంగా ఈఓపిఆర్‌డి మాట్లాడుతూ గ్రామాలలో వృధా నీటిని రోడ్లపై వేయరాదని ప్రజలను కోరారు.

చేతిపంపు పరికరాలు మంజూరు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలానికి రూ6.60 లక్షల నిధులతో చేతి పంపు పరికరాలు మంజూరైనట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉన్నాయని ఇందుకు సంబంధించి 240 చేతిపంపులు ఉన్నాయన్నారు. ఇందులో ప్రస్తుతము 185 చేతిపంపులు పనిచేస్తున్నాయన్నారు. మండలంలో ఇప్పటివరకు ఎక్కడ నీటి సమస్య లేదని ఆయన తెలిపారు. మంజూరైన పరికరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉంచడం జరిగిందన్నారు. చేతి పంపులు చెడిపోయిన సమయంలో పరికరాలను మెకానిక్ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కోటయ్య, వొకేషనల్ ట్రైనర్ బాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పారిశ్రామిక సందర్శన ఏర్పాటు చేసారు. చాగలమర్రిలోని 2,4 సచివాలయాలను సందర్శించి సచివాలయ వ్యవస్థ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మను అబ్దుల్లా,ఉపాధ్యాయులు మహబూబ్ బాష, బురాందీన్ బాబా,మధురిమ,వ్యాయామ సంచాలకులు దాదాపీర్,భారతి పాల్గొన్నారు.

బాల అకాడమీ పాఠశాలలో రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో శుక్రవారం రంజాన్ వేడుకలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ పవిత్రమాసం రంజాన్ అన్నారు. పాఠశాల చిన్నారులు ముస్లిం సాంప్రదాయ వస్త్రధారణలతో అబ్బురపరిచారు.

ఎంపికైన విద్యార్థులతో జ్యోతి విద్యానికేతన్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి పోటీలకు జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు

ప్రజాశక్తి -కోయిలకుంట్ల

పట్టణంలోని గుల్లదుర్తి రోడ్డున ఉన్న జ్యోతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సింధూరి, కరస్పాండెంట్ సవిత నాథ్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈనెల 17న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా సీనియర్స్ షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపికలలో తమ పాఠశాల విద్యార్థులు వీరభద్ర రెడ్డి, సుభాష్ రెడ్డి, శశికిరణ్ రెడ్డి, మల్లికార్జున ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారన్నారు. వీరు ఈనెల 22,23 తేదీలలో అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలో రోళ్ళ గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. జ్యోతి విద్యాని కేతన్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వరేడ్డి, పార్వతి, శృతి, సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నర్సింగ్ శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - బేతంచర్ల

ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహాయ సహకారాలతో రెండు నెలల పాటు పట్టణంలోని శ్రీ శేషారెడ్డి హై స్కూల్ నందు ఇస్తున్న ఉచిత జనరల్ డ్యూటీ, నర్సింగ్ సహాయకుల శిక్షణకు యువతులు దరఖాస్తు చేసుకోవాలని ఎపి స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ బంగి శిరీష శుక్రవారం తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న యువకులు, యువతులు సద్విని చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆమె అన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్.రఫి

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-డోన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్.రఫి అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని పాతపేటలోని ఐదవ సచివాలయ పరిధిలోని ఏడవ వార్డు నందు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్.రఫి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్.రఫి మాట్లాడుతూ డోన్‌లో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో కనివిని ఎరగనివిధంగా అభివృద్ధి జరిగిందన్నారు. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. దుబాయ్ శీను,అలాఈశ్వర్, ఖాజావలి,చాంద్, రహంతుల్లా, ఫక్రుద్దీన్,వార్డు వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయంను నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. మండల పరిధిలోని రాయమాల్ పురం గ్రామంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని శుక్రవారం రిబ్బన్ కటింగ్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా స్థాపించడం జరిగిందని అన్నారు. ఈ సచివాలయాల ద్వారా ప్రజలకు వివిధ శాఖల అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలన్న మంచి ఉద్దేశంతో సచివాల వ్యవస్థను స్థాపించడం జరిగిందన్నారు. ఎంపిపి శెట్టి ప్రభాకర్, గ్రామ సర్పంచ్ పసుపులేటి పార్వతమ్మ, గ్రామ వైసిపి నాయకుడు పులా శ్రీను, విజయ్ శేఖర్ రెడ్డి, మునగాల సర్పంచ్ లోకేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణములోని సంతమార్కెట్‌లో శుక్రవారం రంగరాజు పేటకు చెందిన ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. శుక్రవారం వారపు సంత కావడంతో మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని మజ్జిగను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ పాల్గొన్నారు. **చాగలమర్రి :** పట్టణంలో అనాథ రక్షక్ సేవా పౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు. సేవా పౌండేషన్ వ్యవస్థాపకుడు సాయిసుదర్శన్ దాతల సహకారంతో పోలీసులు, హమాలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే స్థానిక బసవన్నకట్ట వీధి రామాలయం వద్ద రచ్చబండ యూత్ సభ్యులు ఆవుల నరసింహప్రతాప్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణయ్య,టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు,పగిడాల బాబు,హరికృష్ణ, నవీన్, రాఘవ,మొహిద్దీన్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో పల్లకి సేవా మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగింపు నిర్వహిం చారు. ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో దేవస్థానం ఆవరణలో పల్లకి సేవ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పల్లకి సేవ మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.